

**శ్రీ భమిడిపాటి శ్రీరామకృష్ణశర్మ**

'ఛీ, దీని దుంపతెగ, బయలుదేరుతూంటేనే పిల్లి శకునమా!' అన్నాడు స్నేహితుడొకడు, పరీక్షలయ్యేక పట్నంనుంచి ఇంటికి బయలుదేరిన వీరాస్వామితో.

'పర్వాలేదులే-స్టేషన్‌దాకా వస్తావా?- ఊఁ, అయితే త్వరగా బండెక్కు—' అన్నాడు వీరాస్వామి గంభీరంగా.

'ఎందుకేనా మంచిది, కాస్సేపు కూర్చుని బయలుదేరరా భాయీ.'

'అఁ పోవోయ్, పల్లెటూరి బైతుల్లాగ నాకు ఆ మూఢవిశ్వాసాలు లేవు సుమా.'

'నువ్వు పుట్టి పెరిగిందెక్కడో, ఇప్పుడు ఎక్కడికి వెళుతున్నావో మరచిపోయినట్టున్నావ్.'

'అయితే మాత్రం: ఇంత చదువు చదువుకునికూడా ఆ కంపే పీలుస్తూండాలేమిటి?'

'వద్దులేరా—నువ్వు ఏమంటావో అని అన్నానంతే.' అన్నాడు స్నేహితుడు; తనకు అలాంటి నమ్మకాలు వున్నా, వీరాస్వామి తన్ను మూఢు డనుకుంటాడేమో అన్న భయంతో.

స్టేషనుకు జేరేటప్పటికే రైలు బయలుదేరడానికి సిద్ధంగా వుంది. టిక్కెట్టు కొని, లోపలికి వెళ్ళేటప్పటికి రైలు కదిలింది. స్నేహితుడు, 'వద్దురా—ప్రమాదం—తర్వాత బండికి వెళుదువుగానిలే—' అంటూన్నా వినిపించుకోకుండా వీరాస్వామి పరుగెత్తుకుంటూ వెళ్ళి రైలు ఎక్కబోయేడు. కాలు జారి ప్లాటుఫారంమీద పడ్డాడు. రైలు ఆగింది. వీరాస్వామికి ప్రమాదకరమైన దెబ్బలేమీ తగలలేదు. లేచి నుంచుని నూటు దులుపుకుంటున్నాడు. రైల్వేగార్డు వచ్చి, 'చదువుకున్న వాళ్ళే ఇలా చేస్తూంటే, ఇంక పల్లెటూరి వాళ్ళ ఏమాట విటి—మీకు ఏదైనా ప్రమాదం జరిగితే మా పీకలమీదకు కూడా వస్తుంది—ఇంకెప్పుడూ అలా చెయ్యకండి—' అని మందలించేడు.

'చదువుకున్న పెద్దమనుషులాకే బాబూ, ఈ తలబిరుసు' అన్నాడు రైలు కిటికీలోంచి తొంగిచూస్తున్న పల్లెటూరి వాడొకడు, తలపాగాలో ఇదివరకు సగం కాల్చి, ఆర్పి దాచుకున్న చుట్టముక్క తీసి వెలిగిస్తూ.

వీరాస్వామి అవమానంతో తలవంచుకుని రైలు ఎక్కేడు.

'పిల్లిశకునం, వద్దురా అంటే విన్నావా' అని ఎత్తిపొడిచేడు స్నేహితుడు, బైట నుంచి రైలుపెట్టె తలుపు మూసేస్తూ.

'ఆ. పోవోయ్; పిల్లి శకునం కనుకనే ఏమీలేకుండా రైలు ఎక్కి కూర్చున్నాను. లేకపోతే, ఏ కాలో చెయ్యో తెగిపోయి వుండునేమో' అంటూ వీరాస్వామి సమర్థించుకున్నాడు. రైలు కదిలింది.

రైలుస్టేషనుకి, వీరాస్వామి పల్లెటూరికి మధ్య నాలుగు మైళ్ళ దూరం వుంది. ఉన్నది మట్టి రోడ్డు. అద్దెబళ్ళు కాని, రిక్షాలు కాని లేవు. కూలివాళ్ళు కూడా వుండరు. అయినా బాధ లేదు. సామానేదైనా వుంటే, వాళ్ళ వూరివాళ్లు ఎవరో ఒకరు, ప్రతిమాలి నెత్తిమీద పెట్టుకుని పోతారు. ఓ పైసా చేతిలో పెట్టి చుట్టముక్క కొనుక్కోమంటే, చాలా సంతోషిస్తాడు. లేకపోతే అడగడు. వీరాస్వామి స్టేషన్‌లో దిగగానే, వాళ్ళ వూరి రామప్పపంతులు 'రావోయ్, రావోయ్' అంటూ ఎదురుగా వచ్చేడు.

'సరి, స్టేషన్‌లో దిగగానే మళ్ళీ ఈ ఒంటి బ్రాహ్మడి శకునమా!' అని గుండెల్లో ఎక్కడో ఓసారి పొడిచినట్టయింది వీరాస్వామికి. కాని, లెక్కచెయ్య దలుచుకోలేదు.

'రావోయ్, మా బండి వుంది; ఎక్కిపోదువుగాని' అన్నాడు మళ్ళీ రామప్పపంతులు.

'పాపం, నాకోసమే తోలుకొచ్చినట్టున్నారు బండి' అన్నాడు వీరాస్వామి కొంచెం వెటకారంగా.

'లేదోయ్. మా ఆడవాళ్ళు రైలుకు వెళుతూంటేను, దిగబెట్టడానికి వచ్చేను. తిరిగి వెళ్ళిపోదామనుకుంటూంటే నువ్వు కనిపించేవు. పోనీ బండిమీదే వస్తావని'—

'అబ్బే, బండెందుకండీ, నడిచే వస్తాను' అన్నాడు వీరాస్వామి, రెండెడ్ల బండిలో ఎక్కడం అంత అవమానం ఇంకోటి వుండ దనుకుని.

'అబ్బే, నడిచి ఎలా వస్తావు, వాన పడింది కూడాను.'

'వాన పడిందా? చచ్చేమే!' అన్నాడు వీరాస్వామి నిస్పృహతో. వాన కురిస్తే దారంతా బురదబురదైపోతుంది. అందులో మాంచి రేగడి మట్టేమో; ఒక్కొక్క అడుగు వేసి తీసేటప్పటికి వున్న శక్తిఅంతా వుపయోగించవలసిందే. ఆ వూరి వాళ్ళు, అంత బురదలోనూ చకచకా నడిచిపోతారు. కొత్తవాళ్ళయితే మాత్రం, మధ్య మధ్య జారిపడుతూండకుండా నడవడం అసంభవం. వీరాస్వామికి చిన్నప్పటి నుంచీ అలవాటున్నా, ఇప్పుడు నూటూ, బూటూ వున్నాయి మరి. ఎలాగ?

'సరే, పోదామయితే, బండివాడిని పిలవండి'-అన్నాడు వీరాస్వామి విధిలేక.

'పెలాడికి పొలంలో పనుండి రాలేదోయ్. బండి నేనే తోలుకొచ్చేను – ఊఁ, ఎక్కు పోదాం'—

"ఈ పల్లెటూళ్ళవాళ్ళకి 'డిగ్నిటీ' అనేది తెలిసిచస్తే కదూ. ఏపనికి పడితే ఆ పనికే సిద్ధం." అనుకుంటూ బండిలో ఎక్కి కూర్చున్నాడు.

బండి, గతుకుల్లో పడి లేస్తూ మెల్లిగా సాగుతోంది. ఆ కుదుపుకు వీరాస్వామి ఒళ్ళు ముద్దయిపోతోంది. 'ఇదంతా పంతులు శకున ఫలితం కాదుకదా!' అన్న అనుమానం మళ్ళీ తళుక్కున మెరిసింది వీరాస్వామి హృదయంలో. "ఆ శకునం రాబట్టే అదృష్టవశాత్తూ బండి దొరికింది. లేకపోతే—" అని మెదడు సమాధానం చెప్పింది. ఇంకా ఎంతసేపు ఈ బండిలో పడి హూనమవాలో! ఎంత కష్టంగావుంటే మాత్రం ఏం చేస్తాడు? పట్నంలో తారు



గోడ్లమీద, మెత్తగా పాముల్లాగ జారిపోయే కాళ్లు జ్ఞాపకం వచ్చి——

'ఏమండీ పంతులుగారూ, ఇంక ఈ గోకుగ్గతి ఈ జన్మకింతే నేమిటి?' అని అడిగేడు.

'ఏమోనోయ్ - మన ప్రభుత్వం చెబుతూందిగా: 'మన దేశానికి గ్రామాలే వెన్నుపూస' అని. ఆ వెన్నుపూస ఇలాగే వుండాలి కామోసు, మాకేం తెలుస్తుందిచెప్పు.'

"అయితే, మీకుకూడా రాజకీయాలు బాగా తెలుస్తూన్నాయన్న మాట?"

'ఆ, మాకేం తెలిసి ఏడిసేయి లేవోయ్. ఏదో మీబోటివాళ్లు వచ్చినప్పుడు ఓ మాట చెవిలో వేసి పోతూవుంటూరంతే.'

'పోనీ ఓ పేపరు తెప్పించుకోకూడదు రోజూను.'

'అలాగే తెప్పించేం కొన్నాళ్ళు; మీ నాన్న ఓ రూపాయి, నేనో రూపాయి చందా వేసుకుని.'

'అంటే ఇప్పుడు మానేసేరన్నమాట?'

'అన్నమాటే - మొన్న దసరాలకి, ఆ కిష్టిగాడు, మా యింట్లోవున్న పాత పేపర్లన్నీ పట్టుకుపోయేడు, రామమందిరానికి అంటించాలంటూను. దానికి మీ నాన్నకు కోపం వచ్చింది. 'అమ్మితే రూపాయి వచ్చును కాదా' అని గట్టిగా అడిగేడు. ఎందుకొచ్చిందీ లేనిపోని గొడవలని, అప్పటి నుంచీ మానేసేం.'

'ఒక్క రూపాయి కోసమా!'

'అవును మరి; ఒక్క రూపాయి మాత్రం ఎంత కష్టపడితే వస్తుందోయ్.'

రోజూ తను పట్నంలో కాల్చి పారేసే సిగరెట్లపాటి లేదు వెధవ రూపాయి! వీళ్ళకి ఇంత పిసినిగొట్టుతన మేమిటో - పట్నవాసంవాళ్ళకే చెల్లింది అనుభవించేందుకు.' అనుకుంటూంటే బండిచక్రం ఓ గోతిలో దిగబడి కదల్లేదు.

పంతులు బండి దిగి, చక్రం బైటకు గెంటబోయేడు. కాని లాభం లేకపోయింది.

'నువ్వుకూడా దిగి, ఓ చెయ్యివేస్తేనే కాని కదిలేలా లేదోయ్.' అన్నాడు పంతులు.

'క్షమించాలి. నాకు చేతకాదండీ."

"పోనీలే - ఎవరేనా వస్తూంటారు-"

ఇంతలోకే అదృష్టవశాత్తూ ఆవూరి మునసబు 'కొండయ్య' కనిపించేడు, అల్లంత దూరంలో వున్న కొబ్బరితోటలో.

'ఓహోయ్, కొండయ్య బావోయ్' అంటూ గట్టిగా అరిచేడు పంతులు, రెండు చేతులూ నోటికి గొట్టంలా పెట్టుకుని. మునసబు, బొటనవేల్లమీద పైకి సాగుతూ, కనుబొమ్మలకి చెయ్యి ఆనించి పరికించేడు.

'నిన్నేనోయ్ ఓసారి ఇలా వచ్చిపోదూ-' అని మళ్ళీ అరిచేడు పంతులు. మునసబు వస్తూ——

'ఏం పంతులూ, యీ యేల యిలాదిగబడ్డావు?' అన్నాడు నవ్వుతూ.

'పంతులుకాదోయ్ దిగబడత; పంతులు బండి.' అన్నాడు పంతులు నవ్వుతూనే.

'పంతులు మాగట్టోడు: ఏ మాట కామాటే అడ్డొగ్గెత్తాడు.'

'నువ్వు మాత్రం తీసిపోతావేమిటి; అడ్డెయ్యకపోతే, బెడ్డముక్కలా విసిరేస్తావు'

'బండిలో కూకున్నదెవరు? - ఓస్, మన పెద్దరైతు వెంకయ్యగారి బుల్లోడు కాదంటయ్యా! ఓస్, బండిలో పడుచు కుర్రాడుంటేనే, 'ముసిలోణ్ణి నన్ను పిలిచేవు!'

'ఆఁ అలాంటి పడుచువాళ్ళు వందమంది అయితే మాత్రం, నీ ఒక్కడితో సరిపోతారా బావా!'

'ఓస్, నిజమేలే - ఊఁ, సూత్తావేం, పట్టు మరయితే-'

'లేవటంలేదు - నీకూ ఓపిక తగ్గతోంది బావా.'

'ఓస్ పోవయ్యా! గజంలోతు దిగబడిపోతేను - బుజం ఒగ్గితే కాని లెగిచేలా లేదు - ఊఁ, యీపాలి నూడు - ఊఁ అయిలేస్ - ఓస్ - ఊఁ అయిలేస్ - ఓస్ - ఊహు - ఓ బుల్లోడా, కొత్త ముందుకెల్లి ఎద్దుల్ని కొత్తగదమాయించు - ఊఁ పట్టవయ్యా పంతులూ యీపాలి-'

వీరాస్వామి ఎద్దుల్ని గదమడం మొదలెట్టేడు. 'హేయ్, హేయ్-' అంటూ వాటి వీపుమీద అరచేత్తో చరిచేడు. ఎద్దులు, బుర్రలు ఓమారు విదిలించి, ఓపట్టు

## కీచకవధ

బటి నిలచిపోయేయి. మళ్ళీ గట్టిగా చరిచేడు. అరచెయ్యి మాడిపోయింది కాని, అవి లక్ష్యపెట్టలేదు.

'ఒస్, అలా కాదోయ్ బుల్లోడా: ఎద్దు రెండు కాళ్ళ మద్దెకి నీ కాలు పోనిచ్చి, తోక పటుకుని పళ్ళతో కొరుకు-'

'నా నోటితో ఎద్దుతోక కొరకనా!'

పంతులు అందుకుని, 'తోక మెలిపెట్టవోయ్‌చాలు – ఊఁ అలాగ – పట్టవోయ్ బావా'—

ఈసారి ఎద్దులు బిగువుగా పట్టుపట్టేయి.


# సౌందర్యమునకు ఆధారము మీ చర్మము





## మీ ముఖ సౌందర్యమును కాపాడుకొనండి

ఎండ మరియు దుమ్ము, వేడిమి మరియు చల్లదనము, తేమ మరియు వాన . . . ఇండియాలో వీటినుండి మీ చర్మమును మీరు కాపాడుకొనవలయును. హిమాలయా బుకే స్నో విపరీత శీతోష్ణస్థితుల నెదుర్కొనుటకై ప్రత్యేకముగా తయారు చేయబడినది. మీ చర్మమును మీగడవలె మెత్తగాను, మృదువుగాను, స్వచ్ఛముగాను నుంచేటందుకు ప్రతిదినము దానిని వాడండి. పౌడరు రాసుకొనుటకు ముందు దీనిని వాడుటకు మీరు మిక్కిలి ఇష్టపడుతారు. దాని సువాసనను మీరు మెచ్చుకొంటారు.






# హిమాలయా బుకే స్నో

మరియొక దివ్యమైన ఇరాస్మిక్ సరకు

HBS. 8-X52 TL

ఇరాస్మిక్ కంపెని లిమిటెడ్, లండన్‌వారి తరఫున ఇండియాలో తయారుచేయబడినది

పంతులు, కొంచెయ్య భుజాలు కౌసి, ఎలా గైతేనేం చక్రం బయటకు నెట్టేరు. పాపం, వీరాస్వామి లాగుమీదా, చేతిమీదా ఎర్రులు పేడవేసేయి. వీరాస్వామి అసహ్యించు కోడం చూసి, మనసబు—

'ఓస్, పర్వాలేదు లేవోయ్ బుల్లోడా: గడ్డిపరకలకి రాసెయ్, అదే పోతాది' అంటూ కోరమీసాలు ఓసారి ఎగద్రోసి, చుట్ట తీసి, మునిపళ్ళతో దాని చిగురు కొరికి ఉమ్మేసి, అగ్గిబొద్దుతో చుట్ట ముట్టించి, పెదవులతోనే దాన్ని ఎడం ప్రక్కకు తోసి, 'నే వత్తా పంతులూ' అన్నాడు.

'మంచిది బావా' అన్నాడు పంతులు.

బండి మళ్ళీ యథాప్రకారం సాగిపోతోంది. పుల్లమ్మగారి తోట మలుపులోకి తిరిగింది. తోటలో, 'సుబ్బి' బత్తాయి కాయలు కోస్తోంది. పంతులు, ఓ పొడుం పట్టు ఘాటుగా పీల్చి,

'ఏమే పిల్లా, కాయలు బాగా ముదిరి నట్టున్నాయే' అన్నాడు.

'ఎంతకాలమైనా ముదరకుండా అనాగే కూకుంతా యనుకున్నారేటి?'

'ఎంత ముదిరినా ఇంకా పులుపు చావలే దనుకుంటాను.'

'మీకేటి తెలుద్ది? అనుభగించేవోరికి తెలియాల.'

'అందరికీ అంత అదృష్టం పట్టొద్దూటే.'

'ఎందుకు పట్టుద్ది.'

'ఇంటికే నేమిటి? బండిలో ఎక్కు; చోటుందిలే—'

'బగమంతు డిచ్చిన కాల్లుండగా, బండెందుకేటి.'

'సరే, అయితే నీ యిష్టం.'

బండి సుబ్బికి దూరంగా పోతోంది. 'మాంచి హుషారైన పిల్లలే' అన్నాడు పంతులు. వీరాస్వామి ఏమీ పలుకలేదు. పంతులు వెనుదిరిగి చూసేడు. వీరాస్వామి, సుబ్బికేసే చూస్తూన్నట్టు గమనించేడు. 'ఏమోయ్, వెంకటస్వామీ!' అని పిలిచేడు.

'ఆఁ, నా పేరు వీరాస్వామి అండి పంతులుగారూ.'

'ఆ అదే, అదే—ఔను కానీ, మీ నాన్న ఎంత చెప్పినా వినకుండా, ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోనన్నావు టేమిటి?'

'ఆఁ, ఇప్పటినుంచీ పెళ్ళేమిటి పోనిస్తురూ.'

'అదేమిటోయ్ అలా అంటావు: ఏ వయస్సులో ఆ ముచ్చట తీరాలి కాని—'

'ఇప్పుడేమంత మించిపోయిందీ?'

'ఇంకా మించిపోవడ మేమిటోయ్! పెళ్ళయితే యీపాటికి ఒకళ్ళిద్దరు పిల్లలు కూడా.'

'అనొక్కటే మనకి బాగా చేతనయింది: ఊరికే పంగుల్లాగ కనిపారెయ్యడం.'

'అలా అని నిగ్రహం కలిగివుండడం మంచిదేలే. కాని-'

'కాని?'

'అది లేకుండాపోతే మాత్రం, పెళ్ళి చేసుకోడమే మంచిదేమోనని నా ఉద్దేశం.'

'అంటే?'

'అహ, ఏమీలేదు - ఇప్పుడు మాస్తున్నాం కాదుటోయ్, పెళ్ళిచేసుకోమని పైకి పెద్దకబురు చెప్పడం; కనబడిన ప్రతీ ఆడదానికేసీ ఎగాదిగా కళ్లప్పగించి చూడ్డం; డబ్బు తగలెయ్యడం; పైగా, ఒళ్ళు పాడుచేసుకోడం."

వీరాస్వామి గుండెలకి సూటిగా తగులుతున్నాయి పంతులు మాటలు. ఐనా తొణకకుండా—

'అందరూ అటువంటివాళ్ళే వుంటారనా మీ అభిప్రాయం?"

"అబ్బే, ఎందుకంటారు. అయినా, నీ మాట కాదు లే చెబుతూంట - లోకం అన్నాక మంచీ వుంటుంది, చెడూ వుంటుంది. సామాన్యంగా మనం చూస్తూవుండే విషయం గురించి చెప్పేనంతే - కాదంటావా?'

కాదని ఎలా అనగలడు? రోజూ తనూ, తన స్నేహితులు, తను చూస్తూండే కుర్రాళ్లూ ప్రతినిమిషమూ పడుతూండే తాపత్రయం తనకు బాగా తెలిసిందేకదూ. అయినా,

'అదంతా మన మనస్సు ననుసరించి వుంటుందిలెండి పంతులుగారూ.' అంటూ తప్పించుకుందామని చూసేడు.

'నిజమే, కాదనను. కాని, ఆ మనస్సు కూడా, మన వేదాంత కేసరిగారు చెప్పినట్టు, మనము తినే తిండీ, వయసూ, వాతావరణమూ -'

'అబ్బబ్బ, మీ పురాతన మెట్టవేదాంతాలు, పిచ్చినమ్మకాలు నాకు పరమ అసహ్యం పంతులుగాలూ.' అని డబాయించేడు, పంతులు చెబుతూన్న విషయమే ఓ ఆధునిక శాస్త్రగ్రంథంలో చదివినట్టు జ్ఞాపకం వున్నా కూడా.

'అంతేలే మరి - మాకేముంది, ఇంకవకు కట్టిన పాతగుడ్డలం.' అనేసి, మౌనం వహించేడు పంతులు.

వీరాస్వామి, వాళ్ళ ఇంటిదగ్గర బండి దిగేడు. కొడుకు వచ్చేడని విని, వీరాస్వామి తల్లి గబగబా వీధిలోకివచ్చి, 'కులాసాగా వున్నావా నాయనా.' అంది.

'ఆఁ,-ఆ చేతులేమిటి అలా వున్నాయ్?'

'ఏమీ లేదురా - దొడ్లో పేడపిసికి, పిడకలు చరుస్తున్నాను.'

'ఎంత డబ్బున్నా, ఇంకా పేడా పిడకలూను. అసహ్యమేనా లేదు బ్రతుక్కి.'

'అదేమిట్రా అబ్బాయి, మీ నాన్న నేనూ ఇలా రెక్కలు విరుచుకుని కష్టపడకపోతే ఈ డబ్బంతా ఎలా వచ్చిందనుకున్నావ్?'

'డబ్బున్నప్పుడు కూడా ఇలాంటిపనులే తగులడాలి?'

'డబ్బుందికదా అని వున్నదాన్ని కూడా తెటపారేసుకోమన్నావేమిటి?'

'అదంతా ఎందుకుకాని, ఇక్కడ నేను వున్నంతకాలమైనా అలాంటి పనులు మానేద్దూ, నీకు పుణ్యం వుంటుంది.

'అయ్యొ, అయ్యొ, ఇదేం లంజతనమా, దొంగతనమా? కష్టపడి పని చేసుగోడం కూడా తప్పేనా! బాగుందిరా నాయనా నీవరుస'

'ఇంక నీ వుపన్యాసం కట్టిపెట్టి, కాస్త కాఫీనీళ్లు పడెయ్యి; బుర్రతిరిగిపోతోంది.'

'నువ్వింకా రెండు రోజులదాకా రావని కాఫీ పొడుం అదీ తెప్పించలేదు-'

'ఉత్తరం రాసేనుకదూ.'

'ఏదీ, అందందే!'

'ఈవెధవ వూరికి అన్నీ అంతే. ఉత్తరం వేసిన పదిరోజులకు కాని అంది చావదు.'

'సమయానికి నాన్నగారుకూడా పొలం వెళ్ళి కూర్చున్నారు. ఒరే సన్యాసీ. - ఒరే సుబ్బారావ్ -అవసరమున్నప్పుడు ఒక్కళ్లూ కనిపించరు - ఉండు, నేనే వెళ్ళి తెస్తాను.'

'ఎక్కడికి?'

'కోమటికొట్టుకి'

'నువ్వు వెళ్ళి తెస్తావా! ఇంక పరువూ మర్యాదా ఏమీ అక్కర్లేదన్న మాట!'

'అదేమిట్రా అన్నీ వింతగా మాట్లాడుతావు!'

'నాకు కాఫీ అక్కర్లేదే బాబూ: నువ్వు పోయి నిపని చూసుగో.'

'ఎంతరా, ఇప్పుడే వచ్చేస్తాను-'

'అక్కర్లేదని చెప్పేనా - ఇంక మాట్లాడకు-' అంటూ చరచరా గదిలోకి వెళ్ళేడు బట్టలు మార్చుకుందుకు.

* * *

మర్నాడు ఎండ బాగా కాసింది. నేల కొంచెం ఆరి, పదిమందీ నడిచేచోట్ల కాలిబాటలు పడ్డాయి. సాయంకాలం పడగానే వీరాస్వామి షికారుకు బయలు దేరేడు. అట్టే దూరం పోవడానికి వీల్లేక, చెరువు గట్టుమీదికి వెళ్ళికూర్చున్నాడు. నీటిలో చేపలు గంతుతున్నాయి. ఓ చిన్న చేప, పాపం, ఓ తామరాకుమీద పడిపోయింది. మళ్ళీ నీళ్ళలో పడడానికి గింజుకుంటోంది.

(53-వ పేజీ చూడండి)

# ★ కీచకవధ ★

(9-వ పేజీ తరువాయి)

ఏమవుతుందో చూస్తున్నాడు వీరాస్వామి. ఇంతలో, కాలి మట్టెల చప్పుడు వినిపించింది. చూస్తే, సుబ్బి! కుండ పట్టుకుని చెరువులోకి మెట్లు దిగుతోంది. ఏ సుబ్బి? నిన్న పుల్లమ్మగారి తోటలో బత్తాయికాయలు కోస్తూన్న సుబ్బే! నీటి అంచున వున్న మెట్టుదాకా వెళ్ళి, కుండ నీటిలో వదిల్చింది.

నీటిలో కుండ, ఏటవాలుగా తేలుతూ ఆడుతోంది. సుబ్బి, చీరకుచ్చెళ్ళు వెనక్కి విరిచి నడుందగ్గర దోపింది. జుట్టు విదిల్చి మళ్ళీ కొప్పు పెట్టింది. చెరువులో మోకాలిదాకా దిగి, రెండుదోసిళ్ళ నీరు త్రాగింది. కుండ కడిగి నీరు నింపింది. పైటకొంగు గుండ్రంగా చుట్టకుదురులా చుట్టి తలమీద పెట్టుకుంది. ఒక కాలు పైమెట్టుమీద ఆన్చి, కుండ ఎత్తి ఆ తొడమీద నిలిపింది. ఒక చేత్తో కుండఅంచు పట్టుగుని, రెండో చేత్తో కుండ చుట్టూ నీళు తుడిచేసి, నెత్తిని పెట్టుకుంది. మెట్లు ఎక్కి, ఒక్కక్షణం నిలబడి, నుదుటిమీదకు కారిన నీటి చుక్కల్ని వేలితో లాగేసి, ఇంటిదారి పట్టింది. తామరాకుమీది చేప ఏమయిందో అని చూసేడు వీరాస్వామి. ఓ గ్రద్ద వచ్చి తన్నుకునిపోతోంది. మళ్ళీ సుబ్బి కేసి చూసేడు. అప్పుడే పడుతూన్న చీకట్లలో కలిసిపోయింది.

రోజూ సాయంకాల మయేటప్పటికి, అతని కాళ్ళు చెరువు గట్టుకే లాక్కుని వచ్చేస్తున్నాయి. సుబ్బి కూడా రోజూ వచ్చి, నీళ్ళు తీసుకునిపోతోంది. మాన మర్యాదలకు శంకించి, 'సుబ్బి మాటే తలపెట్టకూడదు,' అనుకునేవాడు ఎప్పటికప్పుడే. కాని, అతనికి శక్యం కాకుండా పోతోంది. అంతకంతకు గుండె నిబ్బరం సడలింది. అందులో ఆరోజు సుబ్బి చెరువులో దిగి జలకమాడింది. తడిగుడ్డలోంచి, చేవలు దేరిన దాని అవయవాలు వీరాస్వామి కళ్ళల్లో గ్రుచ్చుకుపోయేయి 'అబ్బ! సుబ్బి కావాలి' అనుకున్నాడు.

ఆవులమంద మళ్ళించుకుని ఇంటికి పోతూంటే పోలిగాడిని పిలిచేడు వీరాస్వామి. పోలిగాడు వస్తూ,

'ఏటండి అబ్బాయిగోరు, ఓకే! యీడ కూకున్నారు?' అన్నాడు వినయంతో.

'ఏంలేదురా. ఈ పల్లెటూళ్ళో ఏమీ తోచక చస్తున్నాను.'

'అంతేనండి మరి. బస్తీలో అలవాటైపోయినోరికి ఈ పల్లెకొంపలో చవకుంటే సావేనండి—మళ్లీ ఎప్ప డెల్తారేటి బస్తీకి?'

'చదువు అయిపోయిందిరా. ఇంక ఉద్యోగ మయేదాకా ఇక్కడ పడి ఏడవ్వలసిందే.'

'ఉద్యోగమే! సెప్పేరే కాదూ—ఎప్పుడవుద్దో?'

'ఏమోరా.'

'నే నెల్లివత్తానండి; మంద నొగ్గేసేను.'

'ఒరే పోలిగా, నిన్నోమాట అడుగుతాను, ఎవరితోటి చెప్పవుకదా?'

'శా, శా. అటువంటి దెప్పుడేనా సేసేనేటండి, అబ్బాయిగోరు అలా అంటారు.'

'పెట్టకూడా తెలియకూడదురా.'

'పిట్టకేటండీ పుట్టకూడా తెలీదనుకోండి అబ్బాయిగోరూ.'

'ఇదిగో చూడు-ఇంకా దగ్గరగా రారా - ఆ నీళ్లు పట్టుకెళ్ళే అమ్మాయి ఎవర్రా?'

"ఆఁ? - ఓసోస్, సుబ్బి! ఓలమ్మో, దానికి ఒళ్లమాలిన టెంపరునెండి అబ్బాయిగోరూ - అప్పిగాడు కూతురు.'

'ఎలాంటి దేమిటి?'

'ఏమోనండి మరి, వూరంతా మా మంచి మనిసంటారు. నేనుమాత్రం సచ్చినా ఒప్పుకోను అబ్బాయిగోరూ. ఆ రాముడిగాడితో గడ్డిమేటి రెనకాల గుసగుసలాడుతూంటే లచ్చసార్లు సూశా-ఆళ్ళిద్దరికి పెళ్లవుద్దంట!'

'రాముడెవర్రా? ఆ నారయ్య కొడుకే?'

'ఆడే, ఆడేనండి బాబు. అబ్బో, ఆడి మాటంటే మోతే కాదండీ - బలే రవుడీనెండి - ఆడు కర్రుచ్చుగుంటే దేవరో!-'

'అప్పుడే అంతవాడయేడన్న మాట! ఊఁ, అయితే మనకేమీ లాభం లేదన్న మాట?'

'ఏటీ! అబ్బాయిగోరి కన్నడిందే! - అదెందుకునెండి మనకి.'

'అదే కావాలిరా. చూడు, ఈ ఐదు రూపాయిలూ తీసుగో. నువ్వలాగైనా దాన్ని ఒప్పించేవంటే ఇంకా ఇస్తా.'

'ఓస్, అదెంతపనేటి - నిముసాలమీద వొప్పిత్త - అబ్బాయిగోరి మాటకు అడ్డేటి.'

'ఎవ్వరికీ తెలియకూడదు సుమా.'

'వొట్టంటే వొట్టే. సచ్చినా తెలవదనుకోండి.'

'సెప్పినట్టు చెయ్యకపోయేవా చూసుగో ఏంచేస్తానో.'

'మీకెందు కబ్బాయిగోరూ, రేపీయేలకి ఆ ముండ మీ పాదాలకాడ వుండకపోతే సూడండి నా తమాసా.'

'సరే, పో.'

'సిత్తం, సిత్తం.'

పోలిగాడు దూడల్ని కట్టేసి, తిన్నగా సుబ్బిదగ్గరకు వెళ్ళేడు. వెళుతూనే, 'సుబ్బీ, నీపంట పండింది నేవే, పండింది నేవే, పంటపండింది నేవే -' అంటూ అడుగులు వేస్తూ సుబ్బి చుట్టూ తిరిగి భజనచెయ్యడం మొదలెట్టేడు. వాణ్ణి ఎంతో కష్టంమీద కూర్చోబెట్టి సంగతేమిటని అడిగింది.

'అబ్బాయిగోరు నీమీద కన్నేసేడు నే - నీ పున్నెం పుచ్చిందినే - పుచ్చిందినే.' అంటూ మళ్లీ భజనచెయ్యడం మొదలెట్టేడు.

'ఒరే, సరిగా సెబుతావా, మా అయ్యని పిలవమంటావా?' అని సుబ్బి గద్దించింది.

'సెబుతాగాని, నీకు పున్నెముంటుంది గొడవసెయ్యకే.' అంటూ సుబ్బి చెవిలో సంగతంతా చెప్పేడు. అంతా విని,

'ఆరి సచ్చినోడా, నీకిటువంటి పోగాలం వచ్చిందేరా! నన్నాడిదగ్గర కెల్లమంటావ్! వుండు, మా అయ్యతోటి, మీ అయ్యతోటి సెప్పి నిన్నేం సేయిత్తానో సూడు.' అంటూ మొదలెట్టింది. పోలిగాడు.

'ఓస్, వొల్లకోయే నీగిదసాయింపులా నువ్వూను - పెద్దరైతు కొడుకంటే యేటనుకున్నావో-'

'ఓరిపోరా, సన్నాసి గాదవా!'

'అబ్బాయి గోరు తలసుగున్నారంటే-'

'ఆఁ ఆఁ, తలసుగుని తలసుగుని, ఆడూ నువ్వూ కలిసి ఏడేనా వురెట్టుకు సావండి.'

'ఏటేటీ! మాటలు తిన్నగా రానీ తెలుసా - ఆ రాముడు. గాడితోటి నువ్వు మాటాడుతూంటే ఎన్నిసార్లు సూడనేదేటి—'

'ఓహోహో, ముదురుతోందే - ఆ రాముడుగాడితోటే సెబుతారా నీ,వచ్చే యేలయింది.'

రాముడంటే పోలిగాడికి మరీ భయం. హఠాత్తుగా తగ్గిపోయి, 'వొద్దొద్దే తల్లీ, ఆడితోమాత్రం సెప్పకే నీకు పున్నెముంటాది.' అంటూ సుబ్బి కాళ్లమీద పడ్డాడు.


## నారసింహ లేహ్యము




బంగారు చేర్పబడినది మేహము, నిక్కాక, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 8-4-0 పోస్టేజి 12 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి-నెల్లూరు జిల్లా.

# ★ కీచకవధ ★

'పోరా, పో. మళ్ళీ ఆ వూసెత్తేవా సూసుగో-' అంటూ కరుణించింది సుబ్బి.

పోలిగాడు గంజినీళ్ళు త్రాగి ఇంటి దగ్గరే కూర్చున్నాడు. ఇంతలో ఓ పది పది హేనుమంది పోలిగాడి స్నేహితులు గలగల మంటూ వచ్చేరు. తోలుబొమ్మలాటకి రమ్మన్నారు పోలిగాణ్ణి. పోలిగాడు 'నేను రాను, మీరు పొండ్రా.' అన్నాడు.' ఈడికీ యేల యేదో పట్టిందిరా గట్టిగా. 'కీచక వద' ఆడుతూంటే రాడంట! లాక్కు పదండిరా ఎందుకురాడో సూద్దాం.' అన్నాడు అందులో మొనగాడు. పోలి గాణ్ణి బలవంతంగా లాక్కుని పోయేరు.

బొమ్మలాట అయిపోయింతర్వాత అంద రూ వచ్చేస్తూ, 'బటానీలు కొని నములు కుంటూ పోదాం,డబ్బులుంటే చూడండ్రా' అన్నాడొకడు. ఎవళ్ళిదగ్గరా లేవన్నారు. కాని, అంతమాత్రంతో వదల్లేదు. 'సూత్తా రేటి, యెతకండిరా అందరికాడ' అన్నాడు మన మొనగాడు. ఒకణ్ణొకడు వెదకడం ప్రారంభించేరు. ఒకడి దగ్గర మూడుకాన్లు దొరికేయి. పోలిగాడి దగ్గర అయిదు రూపాయల నోటు! అందరూ ఆశ్చర్యపోయేరు. 'అద్దదీ సంగతి—అందు కేరా రానన్నాడు బొమ్మలాటకి' అన్నా డొకడు. 'ఏదో యేసేడ్రా కన్నం' అన్నా డింకొకడు. 'ఆడెప్పుడూ అటువంటి పను లేరా.' అన్నాడు ఇంకొకడు. దొంగతనం చెయ్యలేదు మొర్రో అని పోలిగాడు ఎంత మొత్తుకన్నా ఎవ్వరూ వినలేదు.

దొంగతనం సెయ్యకపోతే యెలాగొచ్చే యేటిరా? నిజం సెప్పక పోయేవో, మన సబుగారితో సెప్పేత్తా సూసుగో." అని బెదరించేడొకడు. ఎలాగ? నిజం చెబితే రహస్యం బయట పడుతుంది. చెప్పక పోతే, దొంగాడంటున్నారు. పైగా మన సీబుగారితో చెప్పేస్తామంటున్నారు. ఆలో చించేడు.

'దొరికిందిరా' అనేసేడు చటుక్కున.

వాళ్ళు అంతటితో వదిలితే కదూ.

'ఏడరా?' అని అడిగేడొకడు.

'సెరువుకాడ.'

'ఎప్పుడురా?'

'మద్దాన్నం.'

'మద్దాన్నం మందకాడుంటే, సెరువు కాడ దొరికిందట్రా దొంగయెదవా. నాకాడ దాగుద్దనుకున్నావా? నిజం సెప్పక పోతే సూసుగో—' అంటూ పోలిగాడి జుట్టు పట్టుకున్నాడు మొనగాడు.

'అబ్బాయిగోరు యిచ్చేర్రా' అన్నాడు పోలిగాడు నిమ్మదిగా.

'ఎందు కిచ్చేరేటి?'

'ఎందుకో నీ కెందుకేటి?'

'సూత్తారేరా—'

వెనకాలనుంచి పోలిగాడి వీపుమీద నాలుగైదు గుద్దులు ఒకేసారి పడ్డాయి

'పరీచ్చ పేసయేరంట, యిచ్చేర్రా' అన్నాడు పోలిగాడు తడుముకుంటూ.

'అయితే, మనక్కూడా యిత్తారన్న మాటే' అన్నాడొకడు.

'పదండ్రా పోయి అడుగుదాం' అన్నాడు ఇంకొకడు.

'ఈడిని కూడా లాక్కురండిరా, అబ్బాయిగోరి ఎదురుగ్గా అడగాలి.' అన్నాడు మొనగాడు.

'ఉండండె హే—అది కాదు—' అంటూ నసిగేడు పోలిగాడు.

'మరేటి?'

'కోడిపుంజును తెమ్మన్నాడ్రా.'

'అరింటో అన్నుంటే యింకా ఎందు కేటి?'

'ఏమో, ఆర్నే అడుగుపోయి.'

'పదండ్రా యెల్లి అడుగుదాం.'

'ఊంహెండ్రా మీతాడు తెగా—నన్ను సంపేత్తారేరా—'

'లాక్కురండ్రా, సూత్తారేం—'

ఇంతల్లోకే 'ఎవర్రా ఆడ' అన్న కేక వినపడింది.

'అరి బాబో! రాము డొత్తున్నాడ్రా!'

అందరి కాళ్ళూ వణుకుతున్నాయి. ఇంక పోలిగాడి మాట చెప్పాలా? బొమ్మలాట తెరవెనకాల సుబ్బితో సరసాలాడి, ఇంటికి పోతూన్న రాముడు దగ్గరకొచ్చి, 'ఏంట్రా గొడవ సేత్తున్నారు' అని గద్దించేడు. భయ పడుతూ భయపడుతూ ఎలాగైతేనేం అం దరూ కలిసి పోలిగాడి కథ చెప్పేరు.

'ఏరా పోలిగా, సంగతేటి?' రాముడు మళ్ళీ గద్దించేడు.

పోలిగాడి పెదవులు ఆడుతున్నాయి కాని, మాటలు మాత్రం పైకి రాలేదు.

'నిజం సెప్పెయ్యి—నిన్నేంసెయ్యను—' అంటూ రాముడు, పోలిగాడి భుజంతట్టేడు.

పోలిగాడు, విషయమంతా నిమ్మదిగా చెప్పేసేడు.

'ఊఁ, అబ్బాయిగోరి కత అంతకాడ కొచ్చిందన్నమాట — అయితే కీచకవద సెయ్యాల్సిందె — ' అన్నాడు రాముడు కోపంతో.

'ఔనాను మామా, తప్పక సెయ్యా ల్సిందే' తాళం వేసేడు మొనగాడు.

అందరూ 'బలే, బలే' అంటూ చంక లెగరేసేరు.

పోలిగాడు, బిక్కు బిక్కుమంటు న్నాడు.

"ఒరే పోలిగా, నేను సెప్పినట్టు సేత్తా వురా?" అడిగేడు రాముడు. పోలిగాడు తల వూపేడు.

'అబ్బాయిగోరికాడ కెల్లి, 'సుబ్బి వొప్పు కుందని, మిమ్మల్ని సీకటపడ్డాక, జొన్న చేలో మంచకాడకు రమ్మందని' సెప్పాలి- ఏరా మాట్టాడవేం?'

పోలిగాడు మళ్ళీ తల ఊపేడు.

'ఇంకేమన్నా సెప్పేవో, నీతల ఎగిరి పోతాది తెలుసా?'

పోలిగాడు మళ్ళీ తల ఊపేడు.

'అవునుకాని మామా, అబ్బాయిగోరు కీచకుడైతే, మరి భీమసేనుడో?' అడిగే డొకడు.

'మన రాముడేరా, తెలివితక్కువోడా.' తెలియజేసేడు మొనగాడు.

రాముడు 'ఔ'నన్నట్లు తల పంకించేడు.

'మరి, ద్రౌపదో?'

'సుబ్బి లేదంట్రా.'

రాముడి ముఖంలోకి చిరునవ్వు ప్రాకింది.

'భీముడు రాముడనుకో; మరి, ద్రౌపదికి తక్కిన నలుగురేరీ అని?' అడిగే డొకడు అమాయకంగా.

రాముడి ముఖం జేవురించింది.

'ఒరి సవటనాగమ్మా! భీముడు రాము డైతే, ద్రౌపది సీత కాదంట్రా.' చిక్కు విప్పేడొకడు.

రాముడు నవ్వుకున్నాడు.

'ఒరే పోలిగా, నేను సెప్పినట్టు సెయ్యక పోయావో - నా సంగతి తెలుసా?' అంటూ పోలిగాణ్ణి మళ్ళీ ఓసారి హెచ్చరించి, రాముడు వెళ్ళిపోయేడు.

మర్నాడు సూర్యుడు, చెరువుగట్టు అవల జొన్నచేలో మాయమయ్యేడు. ముదిరిన జొన్నకంకులమీదనుంచి గాలితెరలు సన్నగా, చల్లగా, కమ్మగా వీస్తున్నాయి. పొగలంతా; పంగల కర్రా, ఓ సంచినిండా చిన్న చిన్న రాళ్ళూ పుచ్చుగుని, చేనంతా తిరుగుతూ పిట్టల్ని పారద్రోలడంతో అల సిన చేలకాపర్లు, భోంచేసి రావడానికి ఇంటికి పోతున్నారు. ఠీవిగా రాముడు జొన్నచేలో నిర్ణీత ప్రదేశానికి జేరేడు. అప్పటికప్పుడే, పోలిగాడి పరివారమంతా అక్కడే వున్నారు.

'ఒరి మీ తల సిగగొయ్య, మీరంతా ఎందుకురా యీడ?' రాముడు అడిగేడు వాళ్ళని.

'మరి మేమంతా ఉపకీచకులం కామేటి మామా.' అన్నా డొకడు సగర్వంగా.

'అయితే సామీదకే దెబ్బలాట కొత్తరన్న మాట?'

'కాదులే మామా, అది కసలు కతే తెలవదు - మనమంతా కోతులమనుకున్నాం కాదంట్రా'

'అయితే రేపటికి ఒక్క జొన్నకంకు కూడా మిగలదన్నమాట'

'మామా, వద్దువద్దంటూంటే వినకుండా, ఆ నత్తోడు నాలుగు కంకులు కోసేసాడు మామా'

'పోరా, నువ్వుమాత్రం—'

'ఒరే, యింకెవడేనా జొన్నకంకి ముట్టుకున్నాడో సచ్చినాడన్నమాటే- తెలుసా.' అంటూ రాముడు ఆజ్ఞాపించేడు.

'శా, శా, మాకేందుకేటి మామా, కోసినవికూడా నువ్వే తీసుగో' అన్నాడొకడు. రాముడి దగ్గర పాతికము పైన కంకులు పోగుపడ్డాయి అందులో ఓ కంకి తీసి నములుతున్నాడు రాముడు. తక్కినవాళ్ళంతా అదే పని చేస్తున్నారు.

ఇక, వీరాస్వామి కూడా చీకటి పడుతూండగానే బయలు దేరేడు. ఎదురుగా తెలుకులు మనిషి శకునం! అప్రయత్నంగా కాస్సేపు కూర్చుని, మళ్ళీ బయలుదేరేడు. శరీరమంతా కొద్దిగా కంపిస్తోంది. మనస్సు పరిపరివిధాల పోతోంది ఎలాగైతే నేం జొన్న చేను జేరుకున్నాడు. వీరాస్వామి జాడ తెలియగానే రాముడు, 'ఒరే, మీరంతా పోయి కిక్కురు మనకుండా దాంకొండిరా' అని ఆజ్ఞాపించేడు. క్షణంలో అంతా జొన్న చేలో మాయమైపోయేరు రాముడు, దుప్పటీ ముసుగువేసుగుని పడుక్కున్నాడు వీరాస్వామి మెల్లిగా దగ్గరకు వచ్చేడు. సుబ్బిపడుక్కుని వుంది! పాపం, తనకోసం ఎంతసేపటినుండి కాచుకుని వుందో? మాయముండా శకునం రాకుంటే, ఇంతకంటె ముందుగా నే వచ్చి వుండే వాడు. ఇంకా దగ్గరగావెళ్ళి, నిమ్మదిగా దగ్గేడు సుబ్బి కదల్లేదు. 'సుబ్బీ! నాసుబ్బీ! ముద్దులసుబ్బీ! నీ కోసం సేతితో చేసిన మీఠాయివుండలు తెచ్చేను చూడు—'

**రత్నపురుషవేషం**

సువర్ణము ర్యాల్పియములు కలిపి తయారుచేయబడినది. శుక్లనష్టము, గుండెదడ, నరముల బలహీనము అతిమూత్రము మొ॥ మేహ వ్యాధులను హరించును బలమును, కాంతిని, ధాతుపుష్టిని, యిచ్చును అనేక ఆరోగ్యతా పత్రాలు కలవు డబ్బా రు 3-12-0 ఎ. ఏ. అ. 14

**ఇండియన్ మెడిసన్ హౌస్,**
అప్సరటాకీసు రోడ్డు - విజయవాడ—2.

ఆయుర్ధ్య ఒకరోజు ఏమీ తోచక మా యింట్లో అటక మీదవుండే పాత పుస్తకాల బుట్ట క్రిందికి దించి, ప్రతిపుస్తకమూ, ప్రతి కాయితమూ తిరగ వెయ్యటం మొదలు పెట్టాను.

ఒక పాతపుస్తకంలో, మా యింటి పేరుగల వ్యక్తి ఎవరో సింహళద్వీపంలో నూరేళ్ళ క్రితం వున్నట్లు వ్రాయబడి వుంది మా వంశీకులందరినీ కూర్చిన భోగట్టా పోగు చెయ్యాలన్న పట్టుదలతో, వెంటనే ఒక కార్డుముక్క తీసి సింహళ ప్రభుత్వానికి ఫలాని పేరుగల వ్యక్తి ఫలాని సంవత్సరంలో మీ దేశంలో వున్నట్లు చదివాను కనుక, ఆయనను గురించిన యితర భోగట్టా ఏమైనా ప్రభుత్వ రికార్డులలో వుంటే పంపవలసిందనీ, అందుకు అయ్యే ఖర్చు ఏదైనా వుంటే యిచ్చుకోగలననీ ఒక జాబు వ్రాశాను.

రెండు నెలలు తరువాత సింహళ ప్రభుత్వంవారు నా పేరట ఒక కవరు పంపించారు. అందులో యిలావుంది.

"ఫలాని పేరుగల వ్యక్తి ఫలాని సంవత్సరంలో యిక్కడే వున్నట్లు మా రికార్డులద్వారా ఋజువైంది. ఆ వ్యక్తి ప్రభుత్వానికి రు. 3500 దాకా పన్ను ఎగవేసి వున్నట్లు కూడా తేలింది.

కాబట్టి మీరు ఆ మొత్తాన్ని. యీ భోగట్టా అంతా వెదకటానికి అయిన ఖర్చుకుగాను రు. 250/- నీ వెంటనేమాకుపంపవలసింది."

అంటూ ముసుగు తీసేడు. చూస్తే ఏముంది' సుబ్బికాదు. రాముడు!! వీరాస్వామికి మతిపోయింది. ఏమి చెయ్యాలో తోచక, రాతిబొమ్మలాగ నిలబడిపోయేడు. రాముడు లేచి, వీరాస్వామి జుట్టుపట్టుకుని, దవడలు రెండూ వాయగొడుతున్నాడు. మన కీచకుడు మాత్రం ప్రతిఘటించ దలచుకో లేదు! చుట్టూ దాక్కున్న వాళ్ళంతా ఆపుకోలేక గొల్లుమని నవ్వేసేరు వీరాస్వామి బిక్క చచ్చిపోయేడు

'ఏరా, మరి కీచకుడు ముద్దయిపోలేదేరా?' అడిగేడొకడు ప్రక్కనున్నవాణ్ణి.

'మొహం ముద్దవలేదంట్రా' అన్నాడు ప్రక్కనున్నవాడు

'అదేం గొప్పేటి? నేనే భీముసేనుణ్ణయితేనా—' అంటూ అప్పుడే భీముణ్ణైపోయి నట్లు భావించుకుని ప్రక్కనున్నవాడి వీపు మీద ఓ గుద్దువేసేడు. ప్రక్కనున్నవాడు వూరుకుంటాడా? 'ఒరే, నువ్వేటి భీమసేనుడవేటి - నేనురా భీమసేనుణ్ణి,కీచకొడవూ' అంటూ కలియబడ్డాడు. ముష్టి యుద్ధం ప్రారంభమయింది. అంతటితో ఆగితే బాగానేవుండు. అక్కడవున్న వాళ్ళంతా, ఎవరికివారే భీమసేనుడుగా భావించి, ఎదుటివాణ్ణి కీచకొడ్నుగా చెయ్యాలని ప్రయత్నించేరు. అందరిముఖం, ఇంచుమించు వీరాస్వామి ముఖంలాగ తయారయింది ఉపకీచకులనుకున్నందుకు ఉత్తినే పోతే ఎలాగమరి? రాముడు, 'పోరా, పో- మళ్లీ సుబ్బిగి తలసుకున్నావో చంపేత్తా, తెలుసా—పో' అంటూ వీరాస్వామిజుట్టు వదిలేడు. తెల్లవారేసరికి, వీరాస్వామి ఆ వూళ్ళో లేడు. అంతే, ఆనాటికి ఈనాటికి, వీరాస్వామి మళ్ళీ అవ్వూరి పొలిమేర తొక్కలేదు ఒట్టు. ★